జనం మెచ్చేలా జగన్ పాలన

- ఇంటింటికీ వెళ్లండి.. ప్రజలతో మమేకమవ్వండి..
- గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లే రథసారథులు
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి




రాయదుర్గం: మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి , రూరల్‌లోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతూ..

రాయదుర్గం/గుమ్మఘట్ట: జనం మెచ్చేలా 'జగన్' పాలన సాగింది.. ఎన్నికలప్పుడు ఏవైతే హామీలిచ్చాడో అంతకు రెట్టింపుగా కేవలం మూడేళ్ల వ్యవధిలోనే 98.44 శాతం హామీలను అమలుచేశారు. విద్య, వైద్య రంగాల్లోనూ విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒకేసారి 1.35 లక్షల ఉద్యోగాలు చేపట్టి నిరుద్యోగులకు బాసటగా నిలిచిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. రాయదుర్గం పట్టణంలోని షాదీమహల్‌లో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పతో కలసి మంగళవారం గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. వార్డు సచివాలయాల కన్వీనర్ సిద్దేశ్వర (బుజ్జి) అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ మాట్లాడారు.. పార్టీకి ప్రజలకు అనుసంధానంగా పనిచేసే గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో ముందుకెళ్లి ప్రజలతో మమేకమవ్వాలన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటా వివరించే కీలక బాధ్యతలను సీఎం జగన్ మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. జగన్ సీఎంగా ఉన్నంత వరకే అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, రైతు భరోసా, విద్యాదీవెన, వసతిదీవెన, సున్నావడ్డీ, విదేశీ విద్య తదితర సంక్షేమ పథకాలు పేదల దరిచేరుతాయని, పొరపాటు పడితే తినేఅన్నంలో మట్టి వేసుకున్నట్టేనని హితవు పలికారు. ఈ నెల 11న సీఎం జగన్ 'మన నమ్మకం.. నువ్వే జగనన్న' అనే ప్రచార బాధ్యతను ప్రారంభిస్తాడని, ఆ తర్వాత ఇంటింటికీ పార్టీ సామగ్రితో వెళ్లాల్సి ఉంటుందన్నారు.

టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మేలు చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక ఎల్లో మీడియాతో కలసి దుష్ప్రచారం చేస్తున్నారని విప్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో టీడీపీ శకం ముగిసిపోయిందన్నారు. ఆదరించిన ప్రజలనే వంచనకు గురిచేసిన వ్యక్తి మాజీ మంత్రి కాలవ అని విప్ విరుచుకుపడ్డాడు. రాయదుర్గం ప్రజల పుణ్యానా చీఫ్ విప్, మంత్రి లాంటి కీలక పదవులు అనుభవించినా, మంచి చేయాల్సింది పోయి అప్పులు నెత్తినేసి వెళ్లాడని మండిపడ్డారు. ఈ పెద్ద మనిషి పెట్టిన రూ.40 కోట్ల విద్యుత్ బకాయిలను మనం చెల్లించాల్సి వచ్చిందని ధ్వజమెత్తారు. ఇలాంటి వ్యక్తా నీతులు మాట్లాడేదని విరుచుకుపడ్డాడు. రాష్ట్రంలో బాబు, రాయదుర్గం లో కాలవ ప్రజా ద్రోహులని మండిపడ్డారు. నీ ఐదేళ్ల కాలంలో ప్రజలకు ఏం మేలు చేయగలిగావు.. మా మూడున్నరేళ్ల పాలనలో మేమెంత మేలు చేశామో లెక్కల సహా వస్తాం.. నీకు వచ్చే దమ్ముందా అంటూ కాలవకు సవాల్ విసిరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాష, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, కౌన్సిలర్లు గౌని లావణ్య, శారద, అరవ రేఖ, శ్రీనివాసరెడ్డి, బండి అజయ్, శివపుత్ర, ప్రతాప్, కో–ఆప్షన్ సభ్యులు శ్రీనివాసగుప్త, నజీర్, పార్టీ ముఖ్య నాయకులు పొరాళ్ల శివ, గౌస్ ఇస్మాయిల్, అరవ శివప్ప, దివాకర్, గోరంట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

పార్టీకి వెన్నెముక గృహ సారథులే..

వైఎస్సార్‌సీపీకి గృహసారథులే వెన్నెముకని , నిస్వార్థంగా సేవలందించి మన్ననలు పొందాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఉద్ఘాటించారు. రాయదుర్గం మండలంలోని మద్దానేశ్వరస్వామి దేవాలయంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. సీఎం జగన్ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని టీడీపీ నాయకులు అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీపీ భవాని, మండల కన్వీనర్ మంజునాథ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మంజునాథ, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పాలశీన, కాంట్రాక్టర్ ఆర్టీ కాంతారెడ్డి , రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మేలు చేసిన ప్రభుత్వానికి అండగా నిలవండి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి కుటుంబానికీ మేలు చేసిన ఘనత ము ఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, మేలు చేసిన ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని పందికుంట, పందికుంటతండా గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలసి మాజీ ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. సీఎం జగన్ పాలన అద్భుతంగా ఉందని, మరో 30 సంవత్సరాలు ఈ రాష్ట్రానికి సీఎంగా వైఎస్ జగనే ఉండాలని కోరుకుంటున్నట్లు ప్రజలు తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే అందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి రోల్‌మోడల్‌గా నిలుస్తున్నాయన్నారు. అవినీతిరహిత పాలన జగనన్నతోనే సాధ్యమయ్యిందని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి, స్థానిక సర్పంచు ఉమామహేశ్వరి, ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, వైస్ ఎంపీపీ సుంకమ్మ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు నారాయణరెడ్డి, ముస్తురురెడ్డి, యు వజన విభాగం అధ్యక్షుడు డిష్ సురేష్, ఉపాధ్యక్షుడు ఉస్మాన్, నాయకులు హిమవంత్‌రాజు, గోవిందు, వెంకట్రామిరెడ్డి, మీసాల సుంకన్న, ఓబిరెడ్డి, రత్నశేఖర్, నాగరాజు, బాణే నాయక్, కసినేనాయక్, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సమస్యకు సత్వర పరిష్కారం

పందికుంటలో విద్యుత్ స్తంభానికి ఫ్యూజులు చేతికందే ఎత్తులో ఉన్నాయని కాలనీవాసులు మాజీ ఎమ్మె దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఫ్యూజులు మార్చాలని ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్‌కు ఆయన సూచించారు. స్తంభం కిందిభాగంలో ఉన్న ఫ్యూజులను తీసి పైభాగంలో ఏర్పాటు చేసి ప్రమాదం లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

బూదిగమ్మ ఉత్సవాలకు నూతన రథం సిద్ధం



ఆంజనేయస్వామి నూతన రథం

బెళుగుప్ప: మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం బూదిగమ్మ ఆంజనేయస్వామి, పద్మావతి వేంకటరమణస్వామి ఉత్సవాల్లో నిర్వహించే ప్రభోత్సవాల స్థానంలో దాతల సౌజన్యంతో నూతన రథాలను సిద్ధం చేశారు. ఏటా మాఘమాసంలో నిర్వహించే ఉత్సవాల్లో కొన్ని శతాబ్దాలుగా ప్రభోత్సవం నిర్వహించేవారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దేవదాయశాఖ అధికారులతో కలసి సుమారు.రూ.30 లక్షల నిధులతో దాతల సౌజన్యంతో కర్ణాటకలోని నాయకనహట్టి వద్ద టేకుతో ప్రత్యేకంగా నూతన రథాన్ని తయారు చేసి లారీల్లో బూదిగుమ్మకు విడిభాగాలను చేర్చారు. క్రేను సాయంతో విడిభాగాలను ఒకటిగా చేర్చి శనివారం రాత్రి జరిగే రథోత్సవానికి నూతన రథాన్ని సిద్ధం చేశారు.

భజన పోటీలకు ఆహ్వానం

బెళుగుప్ప మండలంలోని బూదిగుమ్మ ఆంజనేయస్వామి రథోత్సవంలో భాగంగా భజన పోటీలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ తిమ్మారెడ్డి, సలహాదారులు జయచంద్రస్వామి, రామచంద్రారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భజన పోటీలు శనివారం రాత్రి 8.00 గంటలకు ప్రారంభిస్తామన్నారు. ఆసక్తి ఉన్న భజన బృందాలు శనివారం సాయంత్రంలోగా రూ.200 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన భజన బృందాలకు దాతల సౌజన్యంతో రూ.10,000, రూ.8,000, రూ.6,000 రూ. 4,000, రూ.3000, రూ.2000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 9963209567, 9603374255, 9963997581 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఘనంగా రాజుల దేవర ఉత్సవాలు



రాజుల దేవర ఊరేగింపు

గుమ్మఘట్ట: మండలంలోని అడిగుప్ప గ్రామ సమీపంలో రాజుల దేవర ఉత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాలను వేదావతి హగరిలో జలధికి తీసుకెళ్లి పవిత్ర గంగా జలంతో అభిషేకించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం ఎదుట అధిష్ఠించారు. ఈ సందర్భంగా స్వామికి ఆకుపూజ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలను నిర్వహించారు. ఆలయం ఎదుట భక్తులు భక్తి శ్రద్ధలతో పొర్లుదండాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులతో పాటు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. రూరల్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

మంత్రిపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేదిలేదు

శెట్టూరు: మంత్రి ఉషశ్రీచరణ్‌పై టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేదిలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. మండలంలోని ములకలేడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఐదు రోజుల ఇదే గ్రామంలో తెలుగుదేశం నాయకులు ఇదేం కర్మ కార్యక్రమంలో మంత్రిపై అసత్య ఆరోపణలు చేశారన్నారు. రాజకీయ ఉనికి కోసమే తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, ఆయన తనయుడు మారుతీచౌదరి మంత్రిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇదేం కర్మ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ లింగప్ప స్థాయికి మించిన మాటలు మాట్లాడారని, జన్మభూమి కమిటీలో ఉన్న మీరు ఎన్ని అవినీతి పనులు చేశారో ప్రజలకు గుర్తుందన్నారు. మరోమారు మంత్రిపై ఆరోపణలు చేస్తే తెలుగుదేశం నాయకులను గ్రామంలో తిరగనీయమని సర్పంచ్ నాగరాజు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సంధ్యారాణి, గ్రామ సచివాలయ కన్వీనర్లు శివమూర్తి, కిష్టప్ప, రామాంజనేయులు, డీలర్ రాజన్న, నాయకులు శ్రీనివాసులు, నాగభూషణ, ఆనందమూర్తి, నాగప్ప హెచ్చరించారు.

షేడ్‌నెట్ వ్యవసాయం లాభదాయకం

కళ్యాణదుర్గం రూరల్: షేడ్‌నెట్ వ్యవసాయంతో పేద రైతులకు లాభదాయకమని జిల్లా ఉద్యాన అధికారి రఘునాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని తూర్పుకోడిపల్లి, మల్లిపల్లి, తిమ్మగానిపల్లిలో ఎస్సీ మహిళా రైతులు సబ్సిడీతో ఏర్పాటు చేసుకున్న షేడ్‌నెట్‌లను పరిశీలించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏసీ రాధారాణి, ఏపీఎం మంజులతో కలసి ఆయన మంగళవారం తోటలను సందర్శించారు. పూలు, చీర దోసకాయలు, కూరగాయాలు సాగుచేసుకుని లాభాలు ఆర్జించేలా షేడ్‌నెట్ వ్యవసాయాన్ని రూపకల్పన చేసినట్లు జిల్లా అధికారి తెలిపారు. 50 శాతం రాయితీతో ఈ పనులు జరుగుతాయని, మిగిలిన 50 శాతం రుణాన్ని సభ్యురాలు ఉన్నతి ప్రాజెక్టుకు కంతుల రూపంలో చెల్లించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆశా కార్యకర్తలకు అవగాహన

కళ్యాణదుర్గం: ఆశా కార్యకర్తలకు కిల్ కరీ మొబైల్ అకాడమీ, పొగాకు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యాధికారిణి డాక్టర్ సత్యప్రియ ఆధ్వర్యంలో ఆశాడే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్, డీసీఎం శ్రీరాములు ముఖ్యఅతిథిగా హాజరై కిల్ కరీ మొబైల్ అకాడమీ ద్వారా తల్లి బిడ్డలకు మెరుగైన సేవలు గురించి వివరించారు. కిల్ కరీ టోల్‌ఫ్రీ నెంబరు 0124458000, మొబైల్ అకాడమీ గురించి వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు గురించి వివరించారు. పొగాకు పదార్థాలు వినియోగించ బోమని వైద్య రోగ్య సిబ్బందించే ప్రతిజ్ఞ చేయించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

శెట్టూరు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మలేరియా జిల్లా అధికారి ఓబుళు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆర్యోగ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఏఎన్ఎం, ఎంఎల్ హెచ్‌పీ, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ తరుణసాయి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు గ్రామంలో ఆంజినేయస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవ పూజలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగజలాన్ని మహిళలు కలశాలతో ఊరేగింపుగా డప్పు వాయిద్యాల మధ్య తీసుకొచ్చి ఆంజినేయస్వామికి అభిషేకం చేశారు. ప్రత్యేక పుష్పాలతో అలకరించి పూజలు చేపట్టారు. ఆలయ ఆవరణ ప్రత్యేక హోమాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిచారు.

నేడు సచివాలయ కన్వీనర్ల సమావేశం

కణేకల్లు: స్థానిక కేసీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు ఆలూరు చిక్కణ్ణ, టి.కేశవరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు సమావేశానికి హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

బండిమోటు వేలం రేపు

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం మద్దానేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం, పశువుల జాతర సందర్భంగా ఈ నెల 9న ఉదయం 11 గంటలకు బండిమోటు వేలం వేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు, గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొన్నాలని వారు సూచించారు. పశువుల జాతర ఈ నెల 21 నుంచి మార్చి 2 వరకూ నిర్వహిస్తామన్నారు.

ముగిసిన గురుసిద్ధావదూతల ఉత్సవాలు

ఉరవకొండ: మండలంలోని వెలిగొండ గురుసిద్ధావదూతల ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఉదయం భగళముఖి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు, మహామంగళహారతి, కుంకమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గురుసిద్ధావదూతల మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ వీరాంజనేయులు, నాయకులు బ్యాంకు ఓబుళేసు, సింగాడి తిప్పయ్య, ఏసీ ఎర్రిస్వామి, బసవరాజు, వడ్డే ఆంజినేయులు, భక్తులు పాల్గొన్నారు.

సచివాలయాల మండల కన్వీనర్‌గా సుధాకర్‌రెడ్డి

గుమ్మఘట్ట: సచివాలయాల మండల కన్వీనర్‌గా పూలకుంట గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డిని నియమించినట్లు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామ సచివాలయాల కన్వీనర్లు , ప్రభుత్వానికి మధ్య అనుసంధానకర్తగా వ్యవహరిస్తు వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఉరవకొండ: మండలంలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ పావని, డాక్టర్ వెంకటేష్ నాయక్ చేతుల మీదుగా ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం 2023 నూతన క్యాలెండర్‌ను మంగళవారం విడుదల చేశారు. సీహెచ్‌ఓ నాగరంగయ్య, సూపర్‌వైజర్ శ్రీధర్‌మూర్తి, స్వర్ణలత పాల్గొన్నారు.

ఆటో బోల్తా .. ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మల్లికార్జునపల్లి సమీపంలో మంగళవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామానికి చెందిన రైతులు మల్లికార్జున, హరిజన విజయ్‌కుమార్‌లు పండించిన పంటను ఆటోలో ఆత్మకూరు మండలం వడ్డిపల్లికి తీసుకెళ్లి విక్రయించారు. తిరిగి స్వగ్రామానికి ఆటోలో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గాయపడిన విజయ్‌కుమార్, మల్లికార్జునను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

బొమ్మనహాళ్: మండలంలోని కొలగానహళ్లిలో ఇరు వర్గాల మధ్య తలెత్తిన దారి వివాదంతో మంగళవారం రాత్రి ఘర్షణ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన సిద్ధలింగ, నాగార్జున కృష్ణాపురం గ్రామ సమీపంలోని పొలం వద్ద దారికి కంపచెట్లు వేసిన విషయంలో గొడవ పడ్డారు. గ్రామంలోకి వచ్చిన తర్వాత ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. సిద్దలింగకు తీవ్ర గాయాలవడంతో బళ్లారి మిమ్స్‌కు తరలించారు. మరికొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఫిర్యాదు అందింతే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ శివ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

ఉరవకొండ: పట్టణ శివార్లలోని పాత బళ్లారి రోడ్డు నాగులకట్ట వద్ద మంగళవారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బూదగవి గ్రామానికి చెందిన శ్రీరాములు ఉరవకొండ నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా నెరిమెట్ల గ్రామానికి చెందిన వెంకటరెడ్డి, రంగన్న, రామలింగ ద్విచక్రవాహనంపై వస్తూ ఢీకొట్టుకున్నారు. ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అలాగు వెలిగొండ–చాబాల గ్రామాల మధ్య ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందకు పడిన ఘటనలో సిగరపాడు గ్రామానికి చెందిన కృష్ణ, బొజ్జప్పకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

బెళుగుప్ప: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని మంగళవారం మండలంలోని ఎర్రగుడి, ఆవులెన్న, శీర్పి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రచారం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, అధికారులు, గ్రాడ్యుయేట్ ఓటర్లను కలసి ఓటు అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నరిగన్న, అంగడి ఎర్రిస్వామి, అశోక్, విశ్వనాథ్, రామాంజనేయులు, ప్రవీణ్, యోగేశ్వరరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ విప్ పర్యటన

బొమ్మనహాళ్: ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి బుధవారం బొమ్మనహాళ్ మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు కల్లుదేవనహళ్లిలో నిర్వహించే సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఉరవకొండ: తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్‌ను మంగళవారం ఆయన చాంబర్‌లో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జీఎంఎస్ మీరంబాషా, పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి, కో ఆప్షన్ సభ్యుడు పామిడి సలీం, జైనబ్బీ దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా తదితరుల ఆధ్వర్యంలో సన్మానం చేపట్టారు.

నేడు వాహనాల వేలం

కంబదూరు: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన 44 ద్విచక్ర వాహనాలను బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఐ రాజేష్ మంగళవారం విలేకరులకు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.3 వేలు డిపాజిట్‌ను చెల్లించాలన్నారు.

ఘనంగా చర్చి ప్రారంభం

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీఅండ్‌ఐజీ మిషన్ చర్చి ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. బెంగళూరుకు చెందిన సీఅండ్‌ఐజీ మిషన్ చర్చిల చైర్మన్ రెవరెండు త్యాగరాజు ప్రత్యేక ప్రార్థన చేసి చర్చిని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఅండ్‌ఐజీ మిషన్ చర్చిల వైస్ చైర్మన్ ఐజయ్య, ట్రెజరర్ గిద్యోన్, సెక్రటరీ బెంజిమెన్ తిమోతి, డైరెక్టర్లు వరప్రసాద్, ఆరోన్, సర్పంచ్ సంధ్య, పాస్టర్ ఇశ్రాయెల్, సంఘ పెద్దలు మరియదాసు, స్వామిదాసు, లోకనాథ్ పాల్గొన్నారు.

పప్పుశనగ పంటకోత ప్రయోగాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లిలో పప్పుశనగ పంటకోత ప్రయోగాలు చేపట్టారు. జిల్లా అర్థగణాంక శాఖ అధికారి ప్రేమ్‌చంద్ర, ఏఎస్ఓ ఆదినారాయణరెడ్డి, ఏఓ జగదీష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్ మంగళవారం రైతు బ్యాళ్ల తిప్పన్న పొలంలో పంటకోత చేపట్టి దిగుబడిని నిర్ధారించారు ఎకరాకు సరాసరి 6–8 కింటాళ్ల దిగుబడి వచ్చినట్లు జిల్లా అధికారి తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

రాయదుర్గం రూరల్: మండలంలోని చదం గ్రామంలో హరిజన రాము (37) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శారదమ్మ భర్తతో తగవులాడి 15 రోజుల క్రితం పుట్టినిల్లు అయిన దొడగట్టకు వెళ్లింది. దీంతో మద్యం తాగివచ్చి తండ్రితో రోజూ గొడవపెట్టుకునేవాడు. ఈక్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య శారదమ్మ, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కడుపునొప్పి తాళలేక ఉరివేసుకుని మృతి చెందినట్లు భార్య హరిజన శారదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సుమన్ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

కళ్యాణదుర్గం రూరల్: అనారోగ్య పరిస్థితులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళకుంటకు చెందిన తిరుమలయ్య, సుశీలమ్మ కు ముగ్గురు కుమారులు. వీరిలో చిన్న కుమారుడు వీరేందర్ (22) కడుపునొప్పితో బాధపడుతూ పొలంలోని పనస చెట్టుకు లుంగీతో ఉరి వేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆవు ప్రాణాలు కాపాడిన వైద్యులు

కూడేరు: అర్ధరాత్రి ప్రసవ వేదనతో బాధపడుతున్న ఓ ఆవుకు సకాలంలో చికిత్స అందజేసి ప్రాణాలు కాపాడారు వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహన వైద్యులు. వివరాలు... ముద్దలాపురంలో రైతు ఆదినారాయణ పెంచుతున్న ఆవు చూడి కట్టింది. సోమవారం సాయంత్రం ప్రసవ సమయంలో ఆవు ఇబ్బంది పడుతుండడంతో రైతు వెంటనే సంచార పశుఆరోగ్య సేవ వాహన టోల్‌ఫ్రీ 1962కు ఫోన్ చేశాడు. వెంటనే సంచార పశు ఆరోగ్య వాహన వైద్యులు ఆ గ్రామానికి చేరుకుని ఆవును అనంతపురంలోని పశు వైద్యశాలకు తరలించారు. దాదాపు గంట పాటు డాక్టర్లు ఆంజనేయులు నాయక్, కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, సరిత, వీఏ ఆకాష్ శ్రమించి ఆవు గర్భం నుంచి మృతి చెందిన దూడను వెలికి తీశారు. ఆవును సంచార పశు ఆరోగ్య వాహనంలోనే ముద్దలాపురానికి తీసుకువచ్చి రైతు ఇంటి వద్ద వదిలి వెళ్లారు. సంచార పశు ఆరోగ్య వాహన వైద్య సేవలపై ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజారోగ్యమే లక్ష్యం

కూడేరు: ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ సుజాత వైద్య సిబ్బందికి సూచించారు. కూడేరు పీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఆమెతోపాటు జిల్లా జాతీయ ఆరోగ్య సంస్థ ప్రతినిధి చెన్నకేశవులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ మాతా శిశు మరణాలను తగ్గించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సరిత, లక్ష్మీనారాయణ, సీహెచ్‌ఓలు మోహన్‌బాబు, వరలక్ష్మి, సూపర్‌వైజర్లు దేవకర్ణమ్మ, వెంకటలక్ష్మమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

బెళుగుప్ప: నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి దేవదాయశాఖ పరిధిలోని ఆలయ కమిటీ సభ్యుల నియామకాల్లో స్థానం కల్పించడంపై నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ ధనుంజయ మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయీబ్రాహ్మణులకు ఆలయ కమిటీల్లో సముచిత స్థానం కల్పించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ మండల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుషివర్మ, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ఉరవకొండ: మండలంలోని చిన్నముస్టూరులో బుధవారం ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల రూరల్ కన్వీనర్ నరసింహులు, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు సుంకన్న మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ

బ్రహ్మసముద్రం: మండలం కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ వెంకట నాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులతోపాటు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఉరవకొండ: పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో నివాసముంటున్న పెద్ద కోట్ల తేజ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న యువనేత ప్రణయ్‌రెడ్డి మృతుని కుటుంబానికి వార్డు సభ్యుడు కణేకల్లు రఫీక్, పార్టీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు పామిడి జాకీర్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. నాయకులు అయ్యర్‌దాదు, శర్మాస్, బొజ్జన్న, శేఖర్, చౌడప్ప, గోపి, వెంకటేష్, రామచంద్ర, నరసింహులు, రాము, శ్రీహరి పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ధర్నా

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న అపరిశుభ్రత కారణంగా విద్యార్థుల అవస్థలను నిరసిస్తూ మంగళవా విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఇంటర్ బాలుర, బాలికల కళాశాల ఆవరణలో చెత్తాచెదారంతో నిండి దుర్వాసన వస్తున్నా శుభ్రం చేయించడంలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తరగతి గదులు, ప్రాంగణం శుభ్రం చేయించి విద్యార్థులకు ఇబ్బందులు కల్గకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు.

మామిడి తోటకు నిప్పు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కాపర్లపల్లిలో రైతు ఆంజనేయులు మామిడి తోటకు మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. 85 మామిడిచెట్లు కాలిపోవడంతో.. సుమారు రూ.1.80 లక్షల నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.